# నరం లేని నాలుక

**-తాడిమేటి శ్రీదేవి**

లంచ్ టైం అవడంతో సీట్‌లోంచి లేచి బాక్స్ తీసుకుని లాన్‌లోకి నడిచాను. మిగిలిన స్టాఫ్ అందరికీ నేనంటే అంత ఇష్టం లేదనే చెప్పుకోవాలి. పైకి ఏమీ అనకపోయినా వారి కళ్ళు, గుసగుసలు ఆ విషయాన్ని పట్టిస్తాయి.

నేను చేసిన పాపమల్లా నా పని టైం ప్రకారం చేసుకుపోవడమే. వాళ్ళకి మధ్యలో పదకొండు గంటలకి అరగంటపైన టీ బ్రేక్ కావాలి. అటెండర్ చేత టీ తెప్పించుకుని సీట్ కదలకుండా పనిచేసే నేను వాళ్ళకి వింతగా కనబడతాను.

వస్తుంటే వెనుక ఎవరో పనిరాక్షసుడు అనడం వినబడింది. నేను పట్టించుకోలేదు. తీసుకున్న జీతానికి తగినట్లు పనిచెయ్యకపోతే ఎలా అరుగుతాయి ఆ డబ్బులనుకునే మనస్తత్వం నాది. లంచ్ చేసి వస్తుంటే భాస్కరరావు మోహన్‌తో అనడం వినబడింది.

“మా బావ హైదరాబాద్ హెడ్ ఆఫీసులో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడోయ్. పని అంటే ఎంత గౌరవమనుకున్నావ్. వర్క్ ఈజ్ వర్‌షిప్ అనుకునే మనిషనుకో. టేబుల్‌పైన ఎక్కడా పెండింగ్ ఫైల్స్ అనేవే ఉండవు. లెక్కల్లో మనిషనుకో'' అని ఒకటే చెప్పేస్తున్నాడు.

అదే పని ఇంకొకళ్ళు చేస్తే వాళ్ళకి ఎక్కడలేని వంకలు పెట్టాలనిపిస్తుందేమిటో మరి?

ప్రక్క సీట్‌లోని మాధవిగారు పలకరించింది.

“ఏమండోయ్ ఇవాళ ఏం కూర వండారు? స్పెషల్స్ ఏమన్నా వుంటే మాకూ ఇవ్వాలండోయ్'' అంటూ.

అందులో పలకరింపుకన్నా వెక్కిరింపే ఎక్కువ వినబడుతోంది. నా భార్య విజయకు డెలివరీ తర్వాత ఆరోగ్యం పాడయ్యింది. మెటర్నిటీ లీవ్ అయ్యేసరికి కూడా పూర్తిగా ఓపిక చిక్కక సతమతమవుతోంది. ఎవరో పద్నాలుగేళ్ళ పిల్లని తెచ్చుకుని పాపను చూసుకోవడానికి పెట్టుకున్నాం. ప్రొద్దున్న లేచి వంట, క్యారియర్‌లు సర్దడం, మిగిలిన పనులు చూసుకుని, ముందుగదిలో పాపకు కావాల్సిన పాలు, సెరిలాక్, బొమ్మలు అన్నీ అమర్చి మిగిలిన గదులు తాళం వేసి విజయ స్కూల్‌కి, నేను ఆఫీసుకి బయలుదేరాలి.

చూసుకునే పెద్దవాళ్ళెవరూ లేకపోవడంతో నేను సాయంచేస్తూ ఉంటాను. ఆ విషయం తెలుసుకున్న మాధవి ఇలా అవకాశం దొరికినప్పుడల్లా వెక్కిరింతగా మాట్లాడుతుంది. నేను ఒక నవ్వు నవ్వి టేబుల్ సొరుగు సర్దుకోసాగాను. ఇంక పదినిముషాల్లో ఆఫ్టర్‌నూన్ సెషన్ మొదలవుతుంది.

మాధవి అండ్ గ్రూప్ కబుర్లు ఎంతకీ తెమలడం లేదు.

“ఏమండీ మీ అమ్మాయి కులాసానా? ఈమధ్యలో ఇక్కడకు వస్తుందా?'' అని ప్రక్క సెక్షన్ కమల అనడమేమిటి మాధవి వాక్ప్రవాహం అడ్డుకట్టలేకుండా సాగింది.

“మా అమ్మాయి ఇప్పుడెక్కడ వస్తుందండీ. తనని అల్లుడుగారు ఒక్క క్షణం వదలి ఉండలేరు. మా రజని అంటే అతనికెంత ప్రాణం అనుకున్నారు? మొన్న రెండురోజులు వాళ్ళింట్లో ఉండి వచ్చినప్పుడు చూశాను. అన్ని పనులూ తనే చేస్తాడు. అస్సలు భేషజం లేదనుకోండి. పెద్దదాన్ని నేనున్నానని ఆ రెండురోజులు వంట చేశానుగాని వంట కూడా మూడొంతులు అతనే చేసేస్తాడుట. ఎలాగైనా మా అమ్మాయి అదృష్టమనుకోండి అలాంటివాడు దొరకడం''

“అవునవును'' అంటూ అందరూ వంతపాడారు. రెండు నిముషాల క్రితం నన్ను ఆడంగి వాడన్నట్లు ఇన్‌డైరెక్ట్‌గా మాట్లాడిన ఈమె ఎంతగా ప్లేటు ఫిరాయించిందో అని నవ్వుకున్నాను.

ఆఫీస్ అవగానే బండి తీసుకోవడానికి నడిచాను.

“ఉండవోయ్ వస్తున్నాను'' ప్రక్క సెక్షన్ రంగారావుగారు హడావిడిగా వచ్చేశారు.

ఆరునెలల క్రితం నేను స్కూటర్‌కి లోన్ అప్లై చేసినప్పుడు “అప్పుచేసి పప్పుకూడు నాకు నచ్చదోయ్. హాయిగా బోల్డు బస్‌లు ఉన్నాయి. రెండు బస్‌లు మారితే కాలనీ'' అంటూ ప్రవచించాడు ఈ పెద్దమనిషి.

జగదాంబ వరకూ బస్‌లు బాగానే దొరికినా అక్కడినుంచి ఒక్కోసారి లేట్ అయ్యేది. పాపతో పడుతూ, లేస్తూ విజయ అవస్థపడడం చూడలేక, ఎప్పటినుంచో కొనుక్కుంటే బాగుండునని వాయిదా వేస్తున్న నేను బండి కొనడం ఆయన దృష్టిలో లగ్జరీ అయిపోయింది. అదిగో ఆ రోజు నుంచీ నేనాయనకు జీతం, భత్యం లేని నౌకరుని అయిపోయాను. ఆయన హాయిగా బస్‌కి ఖర్చుపెట్టనవసరం లేకుండా నా స్కూటర్‌ని వాడుకుంటున్నాడు. కొంచెం వయసులో పెద్దవారు కాబట్టి ఏమీ అనలేను. ప్రొద్దున్న విజయను స్కూలు దగ్గర దింపవలసి వస్తుందిగానీ లేకపోతే అప్పుడు కూడా ఈయన బాధ నాకు తప్పేదికాదు. సాయంత్రం విజయకు త్వరగా అయిపోవడం వలన వచ్చేస్తుంది. నాకు ఈయన సాహచర్యం తప్పడం లేదు.

ఇంట్లోకి అడుగుపెట్టగానే పాప కేరింతలు వినబడ్డాయి. వాటితో సమానంగా విజయ ముద్దుచేసే మాటలు వినబడడం లేదేంటి అనుకుంటూ లోపలికి నడిచాను. విజయ పరధ్యానంగా తనముందు ప్లేటులో ఉన్న చిక్కుళ్ళు బాగుచేస్తోంది.

“ఏంటోయ్ ఇవాళ చిక్కుడుకాయ వేపుడు చేస్తున్నావా? వెరీగుడ్. కాస్త కాఫీ ఇచ్చేశావంటే నేను కూడా రంగంలోకి దిగుతాను'' అంటూ విజయకేసి చూశాను. ఆమె మొహం బాగా వాడిపోయి ఉంది.

“ఏమైంది విజ్జీ! ఒంట్లో బావుండలేదా?'' ఆత్రంగా మెడ దగ్గర చెయ్యి పెట్టి చూశాను.

“ఏంలేదు. ఉండండి కాఫీ తెస్తాను'' అంటూ లేవబోయింది. చెయ్యి పట్టుకుని కుర్చీ చేతిమీద కూర్చోబెట్టాను.

“ఏం జరిగింది? నాకు చెప్పవా?'' నెమ్మదిగా అడిగాను. ఏ విషయం నానుంచి ఎక్కువసేపు దాచడం తనకి అలవాటు లేదు.

“అదికాదండి. సాయంత్రం రాఘవరావు మావయ్యగారు వచ్చారు''

రాఘవరావుగారు మా పెద్దనాన్న. ఆయనకి నేనంటే ఎంతో అభిమానం. ఇటువైపు వచ్చినప్పుడల్లా మా ఇంటికి తప్పకుండా వస్తారు.

“ఆయన టీ తప్ప తాగరు కదా. మనింట్లో టీ పొడి నిండుకుంది. ఉమని అడిగి తెచ్చాను. ఆయన వెళ్ళాక మన కిరాణాషాపువాడు ఆర్డరు ఇచ్చిన సరుకులు డెలివరీ చేశాడు. సరే ఎలాగూ వచ్చేసాయి కదాని వెంటనే తిరిగిద్దామని వెళ్ళాను'' విజయ గొంతులో పౌరుషం, కోపం, బాధ ముప్పేట గొలుసులా కలిసిపోయాయి.

“ఉమ ప్రక్కింటి కరుణగారితో అనడం నాకు వినబడిందండి. ఆ విజయ ఇందాక టీ పొడి పట్టుకెళ్ళిందండీ. ఎలా అడుగుతారో బాబూ అప్పులు'' అంటూ ఈసడింపుగా మాట్లాడుతోంది. “నేనసలు

ఎప్పుడూ ఏమీ అడగలేదు కూడాను తనను'' అంటూ బాధపడసాగింది. ఓదార్పుగా ఆమె చెయ్యి పట్టుకున్నాను. విజయ అసలే సెన్సిటివ్. ఆమె కళ్లలో సన్నని నీటిపొర. నాకూ మనస్సు చివుక్కుమంది. విజయ చాలాసార్లు చాలా వస్తువులు ఆమెకి ఇవ్వడం నాకు తెలుసు. అల్లం, పచ్చిమిర్చి దగ్గరనుంచి చంటాడికి సెరిలాక్ వరకు పట్టుకెళ్లేది.

విజయ అన్నీ నెలకి సరిపడా ఒక్కసారే లిస్ట్ రాస్తుంది. ఏమైనా అయిపోతాయనిపిస్తే ఒకటికి పది సార్లు గుర్తుచేస్తుంది. అసలు విషయం ఏమైందంటే మాకు టీ తాగే అలవాటు లేదు. గెస్ట్‌ల కోసం తెచ్చి ఉంచుతాం. క్రిందటి నెలలో తెచ్చినదే ఈ నెల కూడా వాడుతోందిట. నిన్ననే అయిపోయిందిట. రేపు ఫస్ట్‌కి అన్నీ వచ్చేస్తాయి కదా ఈ ఒక్కరోజుకి ఏం పోయిందిలే, ఎవరైనా వస్తే కాఫీ ఆఫర్ చెయ్యొచ్చు అని ఊరుకుందిట.

మా పెదనాన్న అసలు కాఫీ తాగరు. ఆయన రాగానే కాస్త టీ ఇవ్వు తల్లీ అంటూ పడక్కుర్చీలో వాలారుట. ఎప్పుడూ ఏమీ అడగలేదుకదాని అడిగితే ఆవిడ ఇంత మాట అంది. నాకూ చిరాకేసింది. ఆవిడ ఎప్పుడూ ఏదీ అడగని మనిషి అయితే అన్నా అర్థముంది. రెండురోజులకొకసారి ఏదో ఒకటి తీసుకెళ్ళే మనిషి ఇలా అన్నదంటే ఏమనుకోవాలసలు? ఇంతలో ఫోన్ మ్రోగింది. వెంటనే లిఫ్ట్ చేశాను. నా మేనత్త భ్రమరాంబ.

"ఏరా రామ్మూర్తీ! ఏం చేస్తున్నావ్'' అంటూ మొదలుపెట్టింది.

"ఆ అందరూ కులాసానే. రేపు ఆదివారం బిఇడి ఎగ్జామ్ రాయడానికి రాగిణి అక్కడికి వస్తోంది. గురువారం బయలుదేరి వచ్చేస్తుంది. రెండురోజులు అక్కడే ఉండి చదువుకుంటుంది. పైగా మీ ఆవిడ బిఇడి చేసింది కాబట్టి దానికేమైనా తెలియకపోతే చెబుతుంది కదా. దాని సెంటర్ మీ ఇంటి నుంచి దూరంట. నీకు బండి ఉందిగా, సెలవురోజే కాబట్టి అక్కడికి వస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. సరేనా?''

"అలాగే అత్తయ్యా'' అని అంటుండగానే ఫోన్ పెట్టేసింది.

గుక్కతిప్పుకోకుండా మాట్లాడడమేగాని గురువారం ఏ టైమ్‌కి ఇక్కడికి వస్తుందో చెప్పలేదు. మేమిద్దరం బయటకు వెళ్లేవాళ్ళమే కాబట్టి లేని టైంలో వస్తే కష్టం. దానిగురించి ఎవరో ఒకళ్ళం సెలవు పెట్టడమో, లేకపోతే ఫోన్‌చేసి సరిగా కనుక్కోవడమో చెయ్యాలి. కనీసం మీకు ఇబ్బంది లేదుకదా అని ఒక్కమాట మాటవరుసకైనా అనలేదు. వెంటనే నాకు విజయ బిఇడి చేసినప్పటి సంగతి గుర్తుకొచ్చింది.

"ఏం ఉద్యోగాలో బాబూ! హాయిగా ఇంటిపట్టున ఉండి మొగుడ్ని, పిల్లల్ని చూసుకోక ఎందుకొచ్చిన సంత?'' అంటూ ఈసడించింది.

ఉద్యోగాలు చేసే ఆడవాళ్లందరూ పిల్లల్ని సరిగా చూసుకోకుండా పనివాళ్లమీద పడేసి తిరుగుతారని నిర్ధారించింది. ఆవిడ మాటలకు హడిలిపోయి విజయ తను తల్లి బాధ్యతలను నిర్వర్తించలేకపోతానేమోనని బెంగపెట్టుకుంది కూడాను.

తనకు టీచింగ్ ప్రొఫెషన్ చాలా ఇష్టం. కానీ తన పాపను సరిగా చూసుకోలేని పరిస్థితి ఎదురవుతుందేమోనని చాలా భయపడింది.

పిల్లల్ని పెంచడం తన ఒక్కదాని బాధ్యతే కాదని, నేను కూడా పాలు పంచుకుంటానని, ఇద్దరం సంపాదించుకోవడం వలన పిల్లలకు మంచి చదువులు చెప్పించి, వాళ్ల భవితకు బంగారుబాటలు వెయ్యవచ్చని, ఇది కూడా మనం పిల్లల బాగు కోసం చేసేదేనని ఎన్నోవిధాల నచ్చజెప్పాక తను కన్విన్స్ కాగలిగింది. నేను ఇచ్చే సహకారం ఆమెకు మనశ్శాంతిగా తన వృత్తిమీద ఏకాగ్రత కుదర్చడానికి ఉపయోగపడింది. మమ్మల్ని అక్కడ అంత మనఃక్షోభకి గురిచేసిన ఈవిడ ఇప్పుడు తన కూతురికి ఉద్యోగం కావాలని తాపత్రయపడిపోతోంది. ఇప్పుడావిడ అనే మాటలు నేను చెప్పగలను.

'అదికాదురా మూర్తీ. పిల్లని చదివిస్తే పెళ్లయ్యాక ఉద్యోగం చేసుకుంటూ వాళ్లాయనకి వేన్నీళ్లకి చన్నీళ్లుగా వుంటుంది కదా' అంటుంది.

ఎటుపడితే అటు తిరిగే నాలుకలున్న ఈ మనుషులను చూస్తుంటే నాలో విసుగు, కోపం పోటీపడసాగాయి.

★

